
అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ బాబా

## 'అమిత్ షా ప్రజలకు క్షమాపణలు చెప్పాలి'

**బోరబండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆయన ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం వీకర్ సెక్షన్ సైట్-3లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విశ్వమేధావి అంబేడ్కర్‌ను కొందరివాడిగా చిత్రీకరించేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి.అశోక్, జైభీమ్ యాదగిరి, ఆనంద్‌కుమార్, దేవేందర్, కవిత, రజి, వలి, మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ సతీష్ కత్తులకు ప్రతిష్టాత్మక అవార్డు

**బంజారాహిల్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):** రేవా ఫౌండేషన్ 2024 (రేవా-రైజింగ్ అవేర్నెస్ ఆఫ్ యూత్ విత్ ఆటిజం) ప్రతిష్టాత్మక గాలా అవార్డును డాక్టర్ సతీష్ కత్తుల (ఏపీపీఐ ప్రెసిడెంట్, యూఎస్) న్యూయార్క్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. రేవా ఫౌండేషన్ ఆటిజంపై అవగాహన కల్పిస్తూ, బాధితులకు మద్దతుగా ఉంటోంది. ఈ క్రమంలో ఆయా రంగాల్లో ఇతరులకు స్ఫూర్తినిచ్చే వారిని సత్కరిసూ గాలా అవార్డును ప్రదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా డాక్టర్ సతీష్ కత్తుల సేవలను గుర్తించిన ఫౌండేషన్ ఆయనకు అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సతీష్ మాట్లాడుతూ.. 25 సంవత్సరాలుగా రేవా ఫౌండేషన్ ఆటిజం బాధితులకు చేస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు మణికాంబోజ్, డాక్టర్ రష్మీశర్మలకు అభినందనలు తెలియజేశారు.


డాక్టర్ సతీష్


బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

## నగరానికి చేరుకున్న గో రక్ష మహా పాదయాత్ర

**పంజాగుట్ట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):** గో రక్షణ, భూ రక్షణ, పర్యావరణ రక్షణ కోసం అఖిల భారత గోసేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన పాదయాత్ర నగరానికి చేరుకుంది. యాత్ర నగరానికి చేరుకున్న సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ నెల 22న బషీర్‌బాగ్ అమ్మవారి ఆలయం నుంచి గడ్డిఅన్నారం వరకు చేపట్టనున్న పాదయాత్ర, గడ్డిఅన్నారం హనుమాన్ ఆలయం వద్ద నిర్వహించనున్న బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. బాలకృష్ణ గురుస్వామి ఒక గోమాతతో కలిసి సెప్టెంబరు 27న కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 14 రాష్ట్రాల గుండా 4,900 కిలోమీటర్ల మేర 180 రోజుల పాటు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.

**నగరంలో యాత్ర సాగుతుందిలా..**

ఖైరతాబాద్ బడా గణేష్ దగ్గరకు చేరుకొని రాత్రికి అక్కడే విశ్రాంతి తీసుకుంటారని, 21న పాదయాత్ర తిరిగి ప్రారంభించి బషీర్‌బాగ్‌లోని అమ్మవారి దేవాలయానికి చేరుకుని అక్కడే విశ్రాంతి తీసుకుంటారని చెప్పారు. 22న ఉదయం ఇరుముడి కట్టుకుని సప్త గోవులతో పాదయాత్ర ప్రారంభిస్తారని.. అబిడ్స్ మొజంజాహి మార్కెట్, సిద్దిఅంబర్ బజారు నుంచి చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి చేరుకుని గో మహా హారతి ఇస్తారని వెల్లడించారు. మీరాలం మండి మహాకాళేశ్వర దేవాలయం, దారుషిఫా, చాదర్‌ఘాట్, నల్గొండ చౌరస్తా మీదుగా గడ్డిఅన్నారం హనుమాన్ దేవాలయం వద్దకు పాదయాత్ర చేరుకుంటుందన్నారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ శివశంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్, శివ స్వామిజీ, మాతా నిర్మాలనంద యోగ భారతి, సాధువులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు పి.రాఘవేంద్ర, మాణిక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో ఉన్న హోంగార్డ్‌ను బైక్‌తో ఢీకొట్టిన యువకులు

- విషమంగా బాధితుడి ఆరోగ్య పరిస్థితి

**ఖైరతాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):** విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ హోంగార్డ్‌ను యువకులు ద్విచక్రవాహనంతో ఢీకొట్టి పారిపోయిన ఘటన సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సైఫాబాద్ ఎస్ఐ పరమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి తెలుగుతల్లి చౌరస్తాలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ కిష్టయ్య రోడ్డు దాటుతుండగా ఎకబల్ మినార్ వైపు నుంచి వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం (టీఎస్ 10ఈబీ 0274) బలంగా ఢీకొట్టింది. దీంతో తలకు, కాలికి బలమైన గాయాలు కావడంతో కిష్టయ్య అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో ఆయన్ను సైఫాబాద్ పోలీసులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తలలో రక్తం గడ్డకట్టడంతో పాటు కాలు విరిగిందని ఎస్ఐ పరమేశ్వరి తెలిపారు. ద్విచక్రవాహనంపై ముగ్గురు వెళ్తూ నిర్లక్ష్యంగా, అతివేగంగా వెళ్లడంతోనే ప్రమాదం జరిగిందని, నిందితులు వాహనాన్ని వదిలి పారిపోయారని చెప్పారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

## ఆస్పత్రి నుంచి మానసిక రోగి అదృశ్యం

**బోరబండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):** మానసిక రోగి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం రామారాం గ్రామానికి చెందిన ఎం.మదార్(32) మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం ఈ నెల 16న ఎర్రగడ్డ మానసిక వైద్యశాలకు అతడి భార్య సునీత తీసుకువచ్చింది. అయితే అదేరోజు సాయంత్రం 4 గంటలకు మదార్ ఆస్పత్రి నుంచి నుంచి వెళ్లిపోయాడు. అతడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# 'ప్రజావాణి'తో ప్రయోజనమెంత?

- ఆర్థిక, ఆస్తి వివాదాలపైనే అధికంగా దరఖాస్తులు
- సివిల్ వివాదాలంటూ తిరస్కరిస్తున్న పోలీసులు
- న్యాయస్థానాల్లో తేల్చుకోవాలంటూ సలహా
- పశ్చిమ మండలం పరిధిలో 114 దరఖాస్తులకు గాను 61 తిరస్కరణ

**బంజారాహిల్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రజాభవన్‌లో ప్రజావాణిని చేపట్టింది. ఇందులో అధికారులు ఎలాంటి ఫిర్యాదులనైనా స్వీకరించి వాటిని సంబంధిత శాఖకు పంపిస్తారు. అలాగే పోలీసులకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే వాటిని నగర పోలీస్ కమిషనర్ అటు నుంచి డివిజన్ స్థాయి ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ల చేతికి అందుతాయి. అందులో వాస్తవాలపై అధికారులు విచారించి చట్టానికి లోబడి ఉండే అంశాలను పరిగణలోకి తీసుకొని అవసరం అయితే కేసు నమోదు చేస్తారు. పోలీసుల పరిధిలో పరిష్కరించలేనిది ఉంటే వెంటనే సివిల్ వివాదం అని నివేదిక రూపొందించి కమిషనర్‌కు పంపిస్తారు. అయితే ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల్లో అధిక శాతం సివిల్ వివాదాలు కాగా, మిగతావి గతంలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినవి ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, పన్నుల విభాగం, ఆస్పత్రుల్లో బిల్లులు ఇలా పలు అంశాలపై దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు పోలీస్ స్టేషన్‌లో తాము ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదంటూ ప్రజావాణిలో మొరపెట్టుకుంటున్నారు.


ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, అధికారులు (ఫైల్)

**సివిల్ వివాదాలంటూ తిరస్కరణ..**

బంజారాహిల్స్‌కు చెందిన ఓ మహిళ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాటు కొనుగోలు నిమిత్తం బ్యాంకు ఖాతా ద్వారా రూ.40 లక్షలు చెల్లించింది. నిర్మాణదారుడు కొంత సమయం అడిగాడు. అయితే నాలుగు సంవత్సరాలు కావస్తున్నా ఫ్లాట్ రిజిస్ట్రేషన్ చేయడం లేదు. విసిగిపోయిన ఆమె కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో తన వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ ఆమె ప్రజావాణిలో వినతిపత్రం అందజేసింది. అయితే ఈ వివాదం సివిల్ వివాదం కిందకు వస్తుందని చెప్పిన పోలీసులు ఆమె ఫిర్యాదును క్లోజ్ చేశారు. మరో కేసులో.. సంజీవరెడ్డినగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఇంటిని సాఫ్ట్‌వేర్ కార్యాలయం నిమిత్తం అద్దెకు ఇచ్చాడు. కానీ అద్దెకు తీసుకున్నవారు సాఫ్ట్‌వేర్ కాకుండా మరో కార్యాలయం ఏర్పాటు చేయడంతో పాటు అద్దె చెల్లించకుండా ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టారు. ఈ విషయంపై ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే ఇలాంటి వివాదాలు కోర్టు పరిధిలోనే పరిష్కరించుకోవాల్సి ఉంటుందని చెప్పి పోలీసులు కేసు మూసివేశారు. దీంతో బాధితుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా ఆ కాపీ మరోసారి పోలీసుల చెంతకే చేరి బుట్టదాఖలైంది. ఇవే కాదు.. తీసుకున్న అప్పు చెల్లించడం లేదంటూ ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**ఒక్కొక్కరిదీ ఒక్కో సమస్య..**

గత ఏడాది ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ వ్యవహారంలో పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంపై సీసీ కెమెరా ఫుటేజీ కూడా ఉంది. తాము పేద వాళ్లమని, న్యాయం చేయాలంటూ మరణించిన వ్యక్తి భార్య ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. అయితే ఇప్పటికే కేసు నమోదు చేసి ఉండటంతో పోలీసులు తాము ఏమీ చేయలేమని నివేదిక ఇచ్చారు.

- బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఎన్‌బీటీనగర్‌లో నివసించే ఓ మహిళ తన ఇంటిని అద్దెకు ఇచ్చింది. సదరు వ్యక్తి 2015 నుంచి అద్దె సక్రమంగా చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నాడు. ఈ విషయంపై మహిళ ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. అయితే ఇది సివిల్ వివాదమంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని చెప్పి పోలీసులు కేసు మూసివేశారు.
- అగ్రిగోల్డ్‌లో 2013లో తాను రూ.6500 చెల్లించానని, ఇప్పటి వరకు నిర్వాహకులు తిరిగి డబ్బు ఇవ్వలేదని సోమాజిగూడకు చెందిన మహిళ ఫిర్యాదు చేసింది.
- ఇనుము నిక్షేపాల వ్యాపారం పేరిట ఓ కంపెనీ వ్యాపారి వద్ద రూ.60 లక్షలు తీసుకుంది. ఏడు సంవత్సరాలు గడిచినా డబ్బు తిరిగి ఇవ్వక పోగా గట్టిగా అడిగితే ఏపీకి చెందిన రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బెదిరిస్తున్నారని అతడు ఫిర్యాదు చేశాడు.

**సగానికి పైగా ఫిర్యాదులు వెనక్కు..**

సుమారు ఏడాది కాలంగా వెస్ట్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాసబ్ ట్యాంక్, బోరబండ, పంజాగుట్ట, సంజీవరెడ్డినగర్ పోలీస్ స్టేషన్లకు చెందిన 114 దరఖాస్తులు ప్రజావాణిలో అందాయి. వాటిలో 40 ఫిర్యాదులు బంజారాహిల్స్ ఏసీపీ పరిధిలోనివి కాగా.. 24 జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో, 11 మధురానగర్, 6 ఎస్సార్‌నగర్, 13 బోరబండ, 20 పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో వచ్చాయి. మొత్తం 114 ఫిర్యాదుల్లో 61 కేసులను ఆయా ఠాణాల అధికారులు వెనక్కి పంపించారు. ఇవి సివిల్ వివాదాలనే కారణంతో తిరిగి పంపించినట్లు అధికారులు చెబుతున్నారు. 114 పిటిషన్లకు గాను కేవలం ఒక్క ఎఫ్ఐఆర్ మాత్రమే నమోదైందని పోలీసులు వెల్లడించారు.

**ప్రతి ఫిర్యాదును పరిశీలిస్తున్నాం**



ప్రజావాణి ద్వారా మాకు వచ్చే అన్ని ఫిర్యాదులను క్షుణంగా పరిశీలిస్తున్నాం. ప్రజావాణిలో ఫిర్యాదు అందిన వెంటనే అవి కమిషనర్ కార్యాలయానికి వెళ్లి అక్కడి నుంచి డీసీపీ ఆఫీసుకు.. అటు నుంచి డివిజన్ ఏసీపీకి చేరతాయి. ఈ ఫిర్యాదులు సివిల్ వివాదానికి సంబంధించినవి అయితే వెంటనే నివేదిక రూపొందించి కమిషనర్ కార్యాలయానికి పంపిస్తాం. ఫిర్యాదులో వాస్తవం ఉంటే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులపై ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. దీంతో దాదాపు అన్ని ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

-సామల వెంకట్‌రెడ్డి, ఏసీపీ, బంజారాహిల్స్


విద్యుత్ సౌధలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు

# బిల్ కలెక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

- 'గృహజ్యోతి' పథకంతో 600 మంది ఉపాధికి గండం
- 25 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలి
- ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్‌రావు విజ్ఞప్తి

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):** విద్యుత్ సంస్థల్లో బిల్ కలెక్టర్లకు పీస్ రేటు రద్దుచేసి కనీస వేతనం చెల్లించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గృహజ్యోతితో ఉపాధి కోల్పోతున్న వారికి ఉపాధి కల్పించాలంటూ సోమాజిగూడ విద్యుత్ సౌధలో శుక్రవారం ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బిల్‌కలెక్టర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో 25 ఏళ్లుగా బిల్ కలెక్టర్ల వ్యవస్థ ఉందని, రెండు డిస్కంలలో 600 మంది పనిచేస్తున్నారన్నారు. గృహజ్యోతి పథకంతో 200 యూనిట్లకు జీరో బిల్ సిస్టంతో 80 శాతం మంది వినియోగదారులు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయిందని, దీంతో బిల్ కలెక్టర్లకు వచ్చే ఆదాయం తగ్గిపోయిందన్నారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్న పీస్‌రేట్ ఉద్యోగులు ఉపాధి కోల్పోతున్నారని, నెలకు రూ.3 వేలు రావడం కూడా కష్టంగా మారిందన్నారు. ఉపాధి కోల్పోతున్న బిల్‌కలెక్టర్లను ఎస్ఈ, ఈఆర్ఓ (ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీస్), డీఈ ఆఫీసుల్లో పనిచేయించుకోవాలని డిమాండ్ చేశారు. బిల్‌కలెక్టర్లకు ఇస్తున్న కమీషన్ స్థానంలో జీఓ నం.11 ప్రకారం స్కిల్డ్ జీతాలు ఇప్పించాలని కోరారు. బిల్‌కలెక్టర్ల సమస్యలపై ఇందిరాపార్కులో నిరాహారదీక్షలు చేయడంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ట్రాన్స్‌కో సీఎండీలకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం ట్రాన్స్‌కో కమర్షియల్ డైరెక్టర్ జగత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాగా, ధర్నా నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యుత్ సౌధ పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బిల్‌కలెక్టర్లు బి.కృష్ణయ్య, సీహెచ్ సోమేశ్, రాజేశ్వరి, సీహెచ్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకెళ్లండి

- అధికారులను ఆదేశించిన నగర కమిషనర్ ఇలంబరిది
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు శాఖలపై సమీక్ష

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):** నగరంలో మహిళా సాధికారిత సాధించేందుకు అధికారులు కృషి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిది అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఎస్టేట్, అర్బన్ కమ్యూనిటీ విభాగం అడిషనల్ కమిషనర్లు, ప్రాజెక్టు అధికారులతో పాటు జోనల్ పీఓలు, అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులతో శాఖల ప్రగతిపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కోటి మహిళలను కోటీశ్వర్లను చేయాలనే లక్ష్యంతో ఉన్నందున నగరంలో అర్హులైన మహిళలను స్వయం సహాయక సంఘాలలో చేర్పించి వారికి బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. ఆ ఆర్థిక సంవత్సరంలో 10,240 స్వయం సహాయక సంఘాలకు రూ.704.67 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకు 5,016 సంఘాలకు రూ.543.43 కోట్లు పంపిణీ చేసిన నేపథ్యంలో వచ్చే నెలవరకు లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఇందిరా మహిళాశక్తి పథకంతో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 7 వేల మహిళా ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌లను నెలకొల్పేదిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రేటర్‌లో రూ.410 కోట్లతో 6 వేల వ్యక్తిగత, వెయ్యి గ్రూప్ ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటుకు జనవరి 20 నాటికి రుణాలు అందించాలన్నారు. ఇప్పటి వరకు 1,062 కొత్త గ్రూప్‌లను ఏర్పాటు చేసినట్లు అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి తెలిపారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ ఇలంబరిది

**ఆస్తులను ఆన్‌లైన్ చేయాలి..**

గ్రేటర్‌లో ఉన్న జీహెచ్ఎంసీ ఆస్తులను కంప్యూటరైజ్ చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఆస్తులకు సంబంధించి లీజు పూర్తయిన, కొనసాగుతున్న వివరాలను సేకరించి వారందరికీ నోటీసులు జారీచేయాలన్నారు. లీజుకు తీసుకున్న వ్యక్తి వినియోగించుకుంటున్నారా లేదా అనేది పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ సి.చంద్రకాంత్‌రెడ్డి, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ పి.సురేష్‌కుమార్, 30 సర్కిళ్ల ప్రాజెక్టు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## నగర పర్యటనకు యూరోపియన్ వర్సిటీల ప్రతినిధులు

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):** యూరోపియన్ వర్సిటీల ప్రతినిధుల బృందం శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఐయూఎన్ గ్రూపు సీఈఓ ప్రొఫెసర్ డాక్టర్ క్రిస్టియన్ వెర్నర్‌తో కూడిన పలువురు ప్రతినిధుల బృందం నగరంలో పర్యటిస్తుండగా.. వారికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి తెలంగాణలో ఉన్న విద్యావకాశాలను వివరించారు. ముఖ్యంగా ఇన్నోవేషన్స్, రిసెర్చ్‌తో పాటు లా అండ్ ఏవియేషన్ రంగాల్లో మంచి అవకాశాలున్న తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోందని వారికి వివరించారు. ఈ సందర్భంగా ప్రతినిధుల బృందంయూరోపిన్ క్యాంపస్‌కు సంబంధించిన ఆఫ్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. సుమారు 1000 మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే ప్రతిపాదన ఉందని, ఇందుకోసం సుమారు 12 మిలియన్ యూరోలను పెట్టుబడిగా పెట్టనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ చదివిన విద్యార్థులను చివరి సంవత్సరంలో జర్మనీకి పంపించి అక్కడ మొత్తం డిగ్రీ పూర్తి చేసేలా చేస్తామన్నారు.


ధూల్‌పేటలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

## నగరంలో పలుచోట్ల గంజాయి పట్టివేత

- నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):** గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న వారిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటి వరకు గంజాయిని ఎక్కువగా ఒడిశా, ఏపీ నుంచి దిగుమతి చేసుకుంటుండగా.. తాజాగా నాగపూర్, ఆదిలాబాద్ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు దిగుమతి చేసుకుంటున్నట్టు ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. శుక్రవారం ధూల్‌పేట ప్రాంతంలోని మచిలీపురలో ఇందర్‌పాల్‌సింగ్ అనే వ్యక్తి ఇంట్లో అధికారులు సోదాలు చేశారు. అతడి వద్ద నుంచి ఆదిలాబాద్ నుంచి దిగుమతి చేసుకున్న 8.6 కేజీల గంజాయితో పాటు 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో సబల్ సకరమ్ అనే వ్యక్తికి సంబంధం ఉండటంతో అతడిపైనా కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. ధూల్‌పేట ప్రాంతంలోని గుంగుర్ బస్తీలో చేసిన తనిఖీల్లో కనాల్ సింగ్ వ్యక్తి ఇంట్లో 1.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు చోట్ల గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్, ఎస్టీఎఫ్ సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్ రెడ్డి అభినందించారు.

**ఫర్నిచర్ మాల్ వ్యాన్‌లో 1.12 కేజీల గంజాయి పట్టివేత**

నగరంలోని ప్రముఖ ఫర్నిచర్ మాల్‌కు చెందిన డెలివరీ వ్యాన్‌లో తరలిస్తున్న 1.12 కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎస్‌జీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్లు ఫర్నిచర్‌ను డెలివరీ చేసి వచ్చే సమయంలో గచ్చిబౌలి ప్రాంతంలో పనిచేసే ఐటీ ఉద్యోగులకు గంజాయిని సరఫరా చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గచ్చిబౌలిలోని టెలికాం నగర్ జీహెచ్ఎంసీ పార్కు ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు హెచ్‌డీఎఫ్ సీఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఫర్నిచర్‌ను రవాణా చేసే వ్యాన్‌లో తనిఖీ చేయగా 1.12 కేజీల గంజాయి దొరికింది. గంజాయి సరఫరా చేస్తున్న చితారి మహేష్, డి.సిద్దులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్, డీఎస్పీ తిరుపతి యాదవ్‌లు అభినందించారు.


పోలీసుల అదుపులో గంజాయి సరఫరా చేస్తున్న డ్రైవర్లు

# ప్రభుత్వ చర్యలతో రియల్ రంగానికి డిమాండ్

- ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షోలో సీజీఎం రాజేశ్‌కుమార్
- రేపటి వరకు కొనసాగనున్న ప్రదర్శన

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):** రీజనల్ రింగ్ రోడ్డు, టూరిజం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడంతో నిర్మాణ రంగానికి డిమాండ్ పెరుగుతోందని, హైదరాబాద్ మౌలిక సదుపాయాలకు ప్రసిద్ధి చెందడంతో రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు మంచి డిమాండ్ ఉందని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేశ్‌కుమార్ అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ హాల్-4లో శుక్రవారం మెగా ప్రాపర్టీ షో-2024ను రాజేశ్‌కుమార్ ప్రారంభించారు. శుక్రవారం ప్రారంభమైన ఈ ప్రాపర్టీ షో ఆదివారం వరకు కొనసాగనుంది. ఈ షోలో ప్రముఖ నిర్మాణ, డెవలప్‌మెంట్ సంస్థలు తమ ప్రాపర్టీలను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ మహా నగరంలో జీవన వ్యయం అనుకూలంగా ఉండడంతో పాటు విద్య, వైద్యం, ఫార్మా రంగాలు శరవేగంగా ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. కమర్షియల్ స్పేస్ వృద్ధి చెందడం వల్ల పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు ఏర్పడుతున్నాయన్నారు. ప్రాపర్టీ షోను సందర్శించేవారంతా ప్రాసెసింగ్ రుసుము, వడ్డీ రాయితీ, బిల్డర్లు ఇచ్చే డిస్కౌంట్లను ఉపయోగించుకోవాలని కోరారు. క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, ఐజీబీసీ ఉపాధ్యక్షులు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్‌బీఐ ఇంత పెద్ద మొత్తంలో ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహించడం అభినందనీయమన్నారు. పరిశ్రమ వర్గాల ఆందోళనలను క్రెడాయ్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిందని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం వల్ల రియల్ ఎస్టేట్ వృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. హైదరాబాద్ నగరం 115 కంపెనీలు ద్వారా రూ.35,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తోందని, ఏడాది కాలంలో 51వేల మందికి పైగా ఉపాధిని కల్పించినట్లు వెల్లడించారు. కస్టమర్లంతా హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌పై నమ్మకం పెంచుకోవాలని, మెగా ఎక్స్‌పోలో తమకు అనువైన ఇంటిని ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్ఈ హెచ్‌బీయూ సీజీఎం మంజు శర్మ, జనరల్ మేనేజర్లు ప్రకాష్ చంద్రబారోర్, రవికుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

# క్రిస్మస్‌కు 'హోలీ ట్రినిటీ' ముస్తాబు

- రంగులు వేసి.. విద్యుత్ దీపాలతో అలంకరణ
- 1847లో బ్రిటిష్ మిలటరీ కోసం చర్చి నిర్మాణం
- ప్రస్తుతం రూ. కోటితో అభివృద్ధి



బొల్లారంలోని హోలీ ట్రినిటీ చర్చి

తిరుమలగిరి డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని హోలీ ట్రినిటీ చర్చిని క్రిస్మస్ వేడుకలకు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. చర్చికి రంగులు వేశారు. వివిధ రంగుల విద్యుత్ దీపాలు అలంకరించను న్నారు. లోపల కొత్త ఫర్నీచర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా చర్చిలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఆదివారం వేలాది మంది భక్తులు విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు.

### మూడున్నర ఎకరాల్లో నిర్మాణం

1847 లో బొల్లారంలోని దట్టమైన అడవీ ప్రాంతంలో ఆంగ్లేయుల మిలటరీ అధికారుల కోసం ఇంగ్లాండ్ రాణి విక్టోరియా సుమారు మూడున్నర ఎకరాలలో హోలీ ట్రినిటీ చర్చిని నిర్మించారు. ఇంగ్లాండ్ నుంచి తీసుకొచ్చిన నిర్మాణ సామగ్రిని ఉపయోగించి బ్రిటీష్ ఇంజినీర్ల పర్యవేక్షణలో ఈ చర్చిని నిర్మించారు. ఇది పూర్తిగా ఇంగ్లాండ్ దేశంలోని చర్చలను పోలి ఉంటుంది. వందేళ్ల పాటు బ్రిటిష్ మిలటరీ అధికారులు ఇక్కడ ప్రార్థనలు చేశారు. 1947 స్వాతంత్ర్యం అనంతరం చర్చి ఆఫ్ సౌత్ ఇండియా(మెదక్ డయాసిస్) ఆధ్వర్యంలో ఈ హోలీ ట్రినిటీ చర్చి కొనసాగుతోంది. 1847లో నిర్మించిన ఈ చర్చి అప్పటి నుంచి చెక్కు చెదరకుండా ఉంది. తెలంగాణ లోని చర్చిల్లో ఇది ఒక ప్రముఖ చర్చిగా కొనసాగుతోంది 1887లో ఎలిజబెత్ రాణి-2 భారత దేశ పర్యటనలో భాగంగా సికింద్రాబాద్ బొల్లారంలోని హోలీ ట్రినిటీ చర్చిని సందర్శించి తన వివాహ మహోత్సవాన్ని ప్రభుత్వ అధికారులతో కలిసి జరుపుకున్నారు. ప్రతీ ఆదివారం 1000 మంది వరకు ఇక్కడికి విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తుంటారు.

### శరవేగంగా పునర్నిర్మాణ పనులు

క్రిస్మస్ వేడుకలకు హోలీ ట్రినిటీ చర్చిను సర్వాంగ సుందరం తీర్చిదిద్దుతున్నాం. సుమారు రూ. కోటి పైచిలుకు ఖర్చు చేసి ప్రముఖ ఆర్కిటెక్ట్ పర్యవేక్షణలో చర్చి పునర్నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం క్రిస్మస్ రోజున 3000మంది భక్తులు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈనెల 22 వ తేదీ (ఆదివారం) రాత్రి క్రిస్మస్‌కు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమా లు జరుగుతాయి. 24వ తేదీ ప్రార్థనలు కొనసాగుతాయి. క్రిస్మస్ నాడు రెవరెండ్ చార్లస్ వెస్లీ ఆధ్వర్యంలో రిటైర్డ్ బిషప్ టీఎస్ కనకప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.



- సుందర్ రావు, చర్చి కార్యదర్శి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తల్లుల సంఘం ప్రతినిధులు

## 'అంగన్‌వాడీ'ల్లోని సమస్యలను పరిష్కరించండి

అడ్డగుట్ట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి డివిజన్ అడ్డగుట్టలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి బృందం శుక్రవారం జిల్లా కలెక్టర్ అనుదీప్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అడ్డగుట్టలో భాగ్యలక్ష్మి విలేకరులతో మాట్లాడారు. మారేడుపల్లి మండలంలో మొత్తం 14 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా, వాటిలో 13 సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. వీటికి ఏడాది కాలంగా ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ఆయా సెంటర్లలో తాగునీటి సమస్యతో పాటు ఆయాల కొరత ఉందన్నారు. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు షెడ్యూల్ ప్రకారం పౌష్టికాహారం అందడం లేదన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కారం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో కోరామన్నారు. అలాగే, అంగన్‌వాడీల్లోని సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు కూడా వినతి పత్రం సమర్పించామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ సువర్ణ, తల్లుల సంఘం ప్రతినిధులు రమాదేవి, శోభ, ఎం. భాగ్య, ప్రవీణ్ కుమార్ ఉన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిది

## మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకెళ్లండి

- అధికారులను ఆదేశించిన నగర కమిషనర్ ఇలంబరిది
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు శాఖలపై సమీక్ష

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో మహిళా సాధికారిత సాధించేందుకు అధికారులు కృషి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిది అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఎస్టేట్, అర్బన్ కమ్యూనిటీ విభాగం అడిషనల్ కమిషనర్లు, ప్రాజెక్టు అధికారులతో పాటు జోనల్ పీఓలు, అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులతో శాఖల ప్రగతిపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కోటి మహిళలను కోటీశ్వర్లను చేయాలనే లక్ష్యంతో ఉన్నందున నగరంలో అర్హులైన మహిళలను స్వయం సహాయక సంఘాలలో చేర్పించి వారికి బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. ఆ ఆర్థిక సంవత్సరంలో 10,240 స్వయం సహాయక సంఘాలకు రూ.704.67 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకు 5,016 సంఘాలకు రూ.543.43 కోట్లు పంపిణీ చేసిన నేపథ్యంలో వచ్చే నెలవరకు లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఇందిరా మహిళాశక్తి పథకంతో మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు 7 వేల మహిళా ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌లను నెలకొల్పేదిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రేటర్‌లో రూ.410 కోట్లతో 6 వేల వ్యక్తిగత, వెయ్యి గ్రూప్ ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటుకు జనవరి 20 నాటికి రుణాలు అందించాలన్నారు. ఇప్పటి వరకు 1,062 కొత్త గ్రూప్‌లను ఏర్పాటు చేసినట్లు అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి తెలిపారు.

### జీహెచ్‌ఎంసీ ఆస్తులను కంప్యూటరైజ్ చేయాలి

గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న జీహెచ్‌ఎంసీ ఆస్తులను కంప్యూటరైజ్ చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఆస్తులకు సంబంధించి లీజు పూర్తయిన, కొనసాగుతున్న వివరాలను సేకరించి వారందరికీ నోటీసులు జారీచేయాలన్నారు. లీజుకు తీసుకున్న వ్యక్తి వినియోగించుకుంటున్నారా లేదా ఇతరులు ఉపయోగించుకుంటున్నారా అనేది పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ సి.చంద్రకాంత్‌రెడ్డి, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ పి.సురేష్‌కుమార్, 30 సర్కిళ్ల ప్రాజెక్టు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు దాతలు చేయూతనివ్వాలి



దివ్యాంగుడితో కలిసి లిఫ్టును ప్రారంభిస్తున్న బాలకృష్ణ, సామల వేణు తదితరులు

సికింద్రాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మానసిక వికలాంగులకు సాయం చేస్తే వారికి చేయూతతో పాటు ధైర్యం ఇచ్చిన వారమవుతామని ఇన్‌కామ్ ట్యాక్స్ కమిషనర్ బాలకృష్ణ, ఇంటర్నేషనల్ మెజీషియన్, ఫిలిమ్ సెన్సార్‌బోర్డు సభ్యుడు సామల వేణు అన్నారు. కార్ఖానా ఓల్డ్‌వాసవి నగర్‌లో మెంటల్లీ డిజేబుల్ ఆర్గనేషన్ సంస్థ ఓ భవనంలో మానసిక వికలాంగుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్టును అస్త్రాల జర్ వక్కంతం చంద్రమౌళి, దివ్యాంగులతో కలిసి వారు ప్రారంభించారు. దివ్యాంగులు ఉంటున్న భవనం రెండో అంతస్తుకు వెళ్లాలంటే కొద్దిగా ఇబ్బందిగా ఉండటంతో దాతలు సాయంతో లిఫ్టును ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పి.గోపినాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల సర్వేను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు

అడ్డగుట్ట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు అడ్డగుట్టలో సర్వే చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ డీసీసీ జిల్లా చైర్మన్ రాజుసాగర్ తెలిపారు. శుక్రవారం నియోజక వర్గంలోని అడ్డగుట్ట పరిధి ఇందిరాలక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల సర్వే నిర్వహించారు. దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి ఫొటోలు తీసి వారి వివరాలను నమోదు చేశారు. ఈ సర్వే ప్రక్రియను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూపతి హరి, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌పై కేసు ముమ్మాటికీ అక్రమం: కార్పొరేటర్లు

బౌద్ధనగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన కేసు ముమ్మాటికీ అక్రమమే అని కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజలు మండిపడ్డారు. సీతాఫల్‌మండి, వారాసిగూడల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. ఈ-కార్ రేసింగ్‌ను అర్థాంతరంగా రద్దు చేయటం వలన రాష్ట్ర ఖజానకు నష్టం వాటిల్లడమే కాకుండా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌తో పాటు తెలంగాణ ప్రతిష్ట అంతర్జాతీయ స్థాయిలో మంటకలిసిందన్నారు. రాజకీయ దురుద్దేశంతో కేటీఆర్‌పై ఈ-ఫార్ములా కేసు నమోదు చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించే కుట్రలు చేస్తున్నారన్నారు. ఇలాంటి కుట్రపూరిత కేసులను రాజకీయంగా ఎదుర్కొని ప్రజాకోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు.

## నేడు క్రియాయోగా ధ్యాన తరగతులు

రాంగోపాల్‌పేట్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా క్రియాయోగా ధ్యానానికి సంబంధించిన ప్రాథమిక విషయాలపై శనివారం ఉచిత ధ్యాన తరగతులు నిర్వహించనున్నట్టు యోగదా సత్సంగ సొసైటీ ఉపాధ్యక్షులు స్వామి స్మరణానంద ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ పీజీ రోడ్డులోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘంలో సాయంత్రం 6.30 గంటల నుంచి ఈ ధ్యాన తరగతులు నిర్వహిస్తామన్నారు. సనాతన ధర్మంలో అత్యంత ప్రాచీనమైన క్రియా యోగా ధ్యాన సాధన ద్వారా ఆధ్యాత్మికంగా అత్యుత్తమ ఫలితాలు పొందవచ్చని, ఆత్మసాక్షాత్కార మార్గం సులభతరమవుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9666665328, 9866548484 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మారేడుపల్లి, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాలలో 1979-81 బీఎస్సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం మారేడుపల్లిలోని మహేంద్రాహిల్స్‌లో జరిగింది. 43 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆలింగనం చేసుకున్నారు. కళాశాలలో చదువుకున్నప్పటి అనుభవాలను గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందగా, ఉత్సాహంగా గడిపారు. ఈ మధుర క్షణాలను పదిలంగా ఉంచుకొనేందుకు సెల్‌ఫోనతో ఫొటోలు దిగారు. ఇటీవల ప్రమాదానికి గురైన కరుణాకర్ రెడ్డిని పరామర్శించారు. ఆర్.వెంకటరమణ, ఎస్.దుర్గా భవాని, ఆర్‌వీ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సంతోష్‌యాదవ్ తదితరులు

## అనాథ శరణాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

సికింద్రాబాద్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ హిల్‌స్ట్రీట్‌లో ఆశ్రయ అనాథ శరణాలయంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మారేడుపల్లి సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ సంతోష్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో రెవరెండ్ లాజరస్, సచిన ఠాకూర్‌లు పాల్గొని కేకును కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు





మజ్దూర్ యూనియన్ కార్యదర్శి రవీందర్‌ను సన్మానిస్తున్న సీహెచ్ శంకర్ రావు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైల్వే కార్మికుల డిమాండ్లను పరిష్కరించడంలో రైల్వే మజ్దూర్ యూనియన్ అండగా ఉంటుందని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ లోని రైల్ కళారంగ్ హాల్‌లో నిర్వహించిన మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైల్వే రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, 8వ పే కమిషన్ సాధించేందుకు ఉద్యమం చేస్తున్నామన్నారు. కార్మికులు యూనియన్‌కు అండగా ఉన్నారని అందుకే రైల్వే గుర్తింపు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించారన్నారు.

### రవీందర్‌కు సన్మానం

దక్షిణ మధ్య రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం సాధించేందుకు విశేష కృషి చేసిన రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి రవీందర్‌ను రైల్ కళారంగ్ జోనల్ వర్కింగ్ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావుతో పాటు ముఖ్య యూనియన్ నేతలు సన్మానించారు.



డ్రైనేజ్ పనులను ప్రారంభించిన రామకృష్ణ తదితరులు

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

మారేడుపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని, కంటోన్మెంట్ నియోజకవర్గంలో నిరంతరం అభివృద్ధికి కృషి చేస్తున్నామని బోర్డు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ అన్నారు. శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు నాలుగో వార్డు పరిధిలోని గాంధీ హట్స్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. బస్తీబాట కార్యక్రమం ద్వారా తాను బస్తీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్నానని, ఆ సమయంలో డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెప్పారన్నారు. దీంతో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మోసం చేశాయన్నారు. నిధులు ఇచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది లేదని రామకృష్ణ విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు విజయానంద్, రాజమల్లేష్, పి.సంతోష్, నాగభూషణం, మహేష్, సరిష్, బస్తీ నాయకులు పాల్గొన్నారు.

## బిల్ కలెక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్‌రావు విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో బిల్ కలెక్టర్లకు పీస్ రేటు రద్దుచేసి కనీస వేతనం చెల్లించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గృహజ్యోతితో ఉపాధి కోల్పోతున్న వారికి ఉపాధి కల్పించాలంటూ సోమాజిగూడ విద్యుత్ సౌధలో శుక్రవారం ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బిల్‌కలెక్టర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో 25 ఏళ్లుగా బిల్ కలెక్టర్ల వ్యవస్థ ఉందని, రెండు డిస్కంలలో 600 మంది పని చేస్తున్నారన్నారు. గృహజ్యోతి పథకంతో 200 యూనిట్లకు జీరోబిల్ సిస్టంతో 80 శాతం మంది వినియోగదారులు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయిందని, దీంతో బిల్ కలెక్టర్లకు వచ్చే ఆదాయం తగ్గిపోయిందన్నారు. ధర్నా అనంతరం ట్రాన్స్‌కో కమర్షియల్ డైరెక్టర్ జగత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ధర్నా నేపథ్యంలో విద్యుత్‌సౌధ పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బిల్‌కలెక్టర్లు బి.కృష్ణయ్య, సీహెచ్ సోమేశ్, రాజేశ్వరి, సీహెచ్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి, ప్రేమకు ప్రతిరూపం క్రిస్మస్

బోయిన్‌పల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శాంతి, ప్రేమకు ప్రతిరూపం క్రిస్మస్ అని, హిందువులకు సంక్రాంతి, దసరా, దీపావళి తదితర పండుగలు, ముస్లింలకు రంజాన్, బక్రీద్ మాదిరిగానే క్రైస్తవులు ఆనందోత్సవాలతో జరుపుకునే పండుగ క్రిస్మస్ అని సెయింట్ పీటర్స్ విద్యాలయాల అధిపతి ఆల్ఫోన్స్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా శుక్రవారం బోయిన్‌పల్లిలోని సెయింట్ పీటర్స్ పాఠశాల ప్రాంగణంలో సెమీ క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకల నేపథ్యంలో పాఠశాల ప్రాంగణంను శోభాయమానంగా అలంకరించారు. క్రిస్మస్ ట్రీ ని ప్రత్యేకంగా అలంకరించి ఆ చెట్టుకు బహుమతులను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శాంతాక్లాజ్ తాతలు చిన్నారులతో సందడి చేస్తూ చిన్నారులకు చాక్లెట్లు పంచుతూ క్రిస్మస్ గిఫ్టలను అందజేసి చిన్నారులను ఉత్తేజపరిచారు. క్రమం ఆల్‌ఫోన్స్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ టి.అరుణారెడ్డి, ప్రిన్సిపాల్ సువర్ణలు, క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంచిపెడుతూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

## బాధితులను పరామర్శించిన కోట నీలిమ

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో షాపులు దగ్ధం అయి ఉపాధి కోల్పోయిన బాధితులకు తక్షణం నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని సనత్‌నగర్ నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు.గురువారం సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో అగ్నిప్రమాదంలో దగ్ధం అయిన దుకాణాలను శుక్రవారం పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.

## సెమీస్‌లో రష్మిక జోడీ ఓటమి



రష్మిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఐటీఎఫ్ అంతర్జాతీయ మహిళల టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో హైదరా బాద్ అమ్మాయి భమిడి పాటి రష్మిక శ్రీవల్లి జోడీ సెమీస్‌లో పరాజయం పాలైంది. శుక్రవారం ముంబైలో జరిగిన డబుల్స్ సెమీస్ పోరులో రష్మిక-జిబెక్ కులంబయేవా (కజకిస్థాన్) జోడీ 3-6, 6-3, 5-10తో భారత్‌కే చెందిన జీల్ దేశాయ్-రియా భాటియా ద్వయం చేతిలో ఓడింది.

బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో..

## ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్ష

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలిక కిడ్నాప్, అత్యాచారం, హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు ప్రత్యేక న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆరాంఘర్ ప్రాంతానికి చెందిన షేక్ జాఫర్, షఫ్రక్ నయీమ్ ఓ బాలికను అపహరించారు. ఆమెపై అత్యాచారం చేసి దాడి చేశారు. బాలిక ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కిడ్నాప్, అత్యాచారం హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన ఎల్‌బీనగర్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి .అంజనేయులు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.16 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

## బోయిన్‌పల్లిలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సర్వే

బోయిన్‌పల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంతం మీదుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్యారడైజ్ నుండి మిలిటరీ డెయిరీ ఫారం వరకు ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఈ క్రమంలో కంటోన్మెంట్ ప్రాంతంలోని బోయిన్‌పల్లిలోని సంజీవయ్య నగర్ ప్రధాన రహదారిలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం హైదరాబాద్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ రాజేశం పర్యవేక్షణలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం సిబ్బంది, హెచ్‌ఎండీఏ అధికారులు భూసేకరణ కోసం సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో స్థానికులతో డిప్యూటీ కలెక్టర్ రాజేశం, ప్రభుత్వ అధికారులు పూరి వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ అక్కడకు చేరుకుని సర్వే అధి కారులతో పాటు డిప్యూటీ కలెక్టర్‌తో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంజీవయ్యనగర్‌లో పేదలు అధికంగా నివసిస్తున్నారని, స్థలం కోల్పోయిన వారికి తగిన విధంగా నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారంతో పాటు ఇంటి స్థలం కేటాయించి ఇళ్లు కట్టించి ఇవ్వాలని అధికారులను కోరారు. ఈ ప్రాంతంలోని ప్రజలు గత నాలుగు దశాబ్దాలుగా నివశిస్తున్నారని, అలాంటి వారు ఈ నిర్మాణాలలో కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని అన్నారు. వీరందరికీ తగిన న్యాయం చేయాలని రాష్ట్రంలో అధికార పార్టీకి చెందిన నాయకుడు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానికులు డిఎం అశోక్‌కుమార్, యాదవరావు, తీరద కుమార్, డీపీ శ్యామ్, వరప్రసాద్, రాజు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో పలుచోట్ల గంజాయి పట్టివేత

- నలుగురిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న వారిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటి వరకు గంజాయిను ఎక్కువగా ఒరిస్సా, ఏపీ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటుండగా, తాజాగా నాగపూర్, ఆదిలాబాద్ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు గంజాయిని దిగుమతి చేసుకుంటున్నట్టు ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. శుక్రవారం ధూల్‌పేట ప్రాంతంలోని మచిలీపురలో ఇందర్‌పాల్ సింగ్ అనే వ్యక్తి ఇంట్లో అధికారులు సోదాలు చేశారు. ఇతడి వద్ద నుంచి ఆదిలాబాద్ నుంచి దిగుమతి చేసుకున్న 8.6 కేజీల గంజాయితో పాటు 3 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో సబల్ సకరమ్ అనే వ్యక్తికి సంబంధం ఉండటంతో అతడిపై కూడా కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. ధూల్‌పేటలోని గుంగుర్ బస్తీలో చేసిన తనిఖీల్లో కనాల్ సింగ్ వ్యక్తి ఇంట్లో 1.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు చోట్ల గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్, ఎస్టీఎఫ్ సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి అభినందించారు.



ధూల్‌పేటలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

### ఫర్నిచర్ వ్యాన్‌లో 1.12 కేజీల గంజాయి స్వాధీనం

నగరంలోని ప్రముఖ ఫర్నిచర్ మాల్‌కు చెందిన డెలివరీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 1.12 కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎస్‌జీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్లు ఫర్నిచర్‌ను డెలివరీ చేసి వచ్చే సమయంలో గచ్చిబౌలి ప్రాంతంలో పనిచేసే ఐటీ ఉద్యోగులకు గంజాయిని సరఫరా చేస్తూ అదనపు ఆదాయాన్ని పొందేందుకు యత్నిస్తుండగా, ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గచ్చిబౌలిలోని టెలికాం నగర్ జీహెచ్‌ఎంసీ పార్కు ప్రాంతంలో హెచ్‌డీఎఫ్ గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు హెచ్‌డీఎఫ్ సీఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఫర్నిచర్‌ను రవాణా చేసే వ్యాన్‌లో తనిఖీ చేయగా, 1.12 కేజీల గంజాయి దొరికింది. గంజాయిని సరఫరా చేస్తున్న చితారి మహేష్, డి.సిద్దులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్, డీఎస్పీ తిరుపతి యాదవ్‌లు అభినందించారు.